క్లుప్తంగా

పరామర్శ



సత్యం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

గుర్ల: మండలంలోని సదానందపురం గ్రామ సర్పంచ్ రెడ్డి నారాయణప్పుడు తండ్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యం అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఆదివారం పరామర్శించారు. సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నసమారాధన



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు, ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. గరివిడి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యిమంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

హిందూ ధార్మిక సమ్మేళనం రేపు



వేపాడలో ప్రజలకు కరపత్రాలు అందజేసి ఆహ్వానం పలుకుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళనం మంగళవారం నిర్వహించనున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ఖండ సంయోజక్ కొరుపోలు అప్పారావు తెలిపారు. ఈ హిందూ ధార్మిక సమ్మేళనానికి ప్రజలు హాజరు కావాలని కోరుతూ మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు అందజేసి ఆహ్వానం పలికారు. వేపాడ రామాలయం వద్ద అప్పారావు మాట్లాడుతూ హిందూ ధార్మిక సమ్మేళనానికి ఆనంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి అతిథిగా హాజరై ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధిస్తారని తెలిపారు. కళాకారులు, భజన, మేల్కొలుపు, పారాయణ బృందాలు, అయ్యప్ప, భవానీ మాలధారణ భక్తులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

చదవడంతో జ్ఞానం వృద్ధి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

డెంకాడ: చదవడం ద్వారా జ్ఞానం వృద్ధి చెందుతుందని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ వై. మహేష్ తెలిపారు. వియ్ లవ్ రీడింగ్ ప్రొగ్రాం కార్యక్రమంలో భాగంగా శాఖా గ్రంథాలయంలో పలు రకాల కథలు, పురాణ, ఇతిహాస, తదితర పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదవడం, రాయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటా యని వివరించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

బాడంగి: రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగే సమ్మేటివ్ పరీక్షలతో పాటు పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణులు కావాలన్న సదుద్దేశ్యంతోనే ఈ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్న వారు 125 మంది వరకు ఉన్నారన్నారు. వీరికి పాఠశాల ప్రారంభ సమయానికి ముందు, తర్వాత, ప్రభుత్వ సెలవుల్లో ఒక్కో సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహించి, సందేహాల నివృత్తితో పాటు అధిక మార్కుల సాధనకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

శరవేగంగా పారాది వంతెన అప్రోచ్ రోడ్డు పనులు

బొబ్బిలి: మండల పరిధిలోని పారాది వంతెన అప్రోచ్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వేగావతి నదిలో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. తొలుత గ్రావెల్ రోడ్డు వేసే పనులు ముమ్మరం చేశారు. నిర్మాణ సామగ్రి పూర్తి స్థాయిలో సమకూర్చామని, పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

కార్తీక వనసమారాధన సందడి



చీపురుపల్లి: శిష్టకరణాల వనమహోత్సంలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు, మహిళలు



గుర్ల: ఆటల పోటీల్లో గెలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు



గుర్ల: ఉపాధ్యాయుల వనమహోత్సవంలో మ్యూజికల్ చైర్ గేమ్ ఆడుతున్న చిన్నారులు

చీపురుపల్లి: మండల శిష్టకరణాల కార్తీక వనసమారాధన ఆదివారం సందడిగా సాగింది. చీపురుపల్లి సమీపంలోని ఓ మామిడి తోటలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అతిథులుగా హాజర య్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు ఐక్యత పెంచుతాయన్నారు. శిష్టకరణాలను దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి బీసీ జాబితాలో చేర్చితే... ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శిష్టకరణాల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. శిష్టకరణాల అంతా ఐకమత్యంగా ముందుకు సాగాలని ఆ సంఘ ప్రతినిధులు అన్నారు. పిల్లలు, పెద్దలు అంతా ఆట, పాటలు, డ్యాన్స్‌లతో సందడి చేశారు. అనంతరం వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు బగ్గాం సుధాకర్, ఆర్.ఆనంద్, గౌరీశ్వరరావు, ఆర్.సురేష్, వి.వెంకటేష్, ప్రభాత్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వనభోజనాలు

గుర్ల: మండల కేంద్రంలోని దత్త ఎస్టేట్‌లో మండల ఉపాధ్యాయుల కార్తీక వనమహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ అతిథులుగా హాజరయ్యారు. అంతా కలిసి వన భోజనాలు చేశారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి నాయకులు బహుమతులు అందజేశారు.

సాఫీగా ప్రయాణం

- రూ.1.75 కోట్లతో ఎం.గదబవలస–తెర్లాం జంక్షన్ రోడ్డు నిర్మాణం



పూర్తయిన ఎం.గదబవలస- తెర్లాం జంక్షన్ బీటీ రోడ్డు నిర్మాణం

మెరకముడిదాం: మండలంలోని ఎం.గదబవలస గ్రామం నుంచి తెర్లాం జంక్షన్ వరకు సుమారు 2.5 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యా యి. ఈ మార్గంలో మెరకముడిదాం మండలంలోని ఎం.రావివలస, ఎం.గదబవలస, ఎం.పాలెం, సోమలింగాపురం, మెరకముడిదాం గ్రామాలకు చెందిన ప్రయాణికులతో పాటు తెర్లాం మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు ప్రయాణిస్తుంటారు. గతంలో అధ్వానంగా ఉన్న ఈ గ్రావెల్ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వంలో పాలకులను ఎం.గదబవలస గ్రామస్తులు ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్తులు తమ గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కోరారు. వారు స్పందించి తారురోడ్డు నిర్మాణానికి రూ.1.75 కోట్లు మంజూరు చేయించారు. ఈనిధులతో ఇటీవల తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలో గోతులు తేలిన ఈరోడ్డులో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడే వాళ్లమని, ఇప్పుడు ప్రయాణం సాఫీగా సాగిపోతోందని ఆ మార్గంలో ప్రయాణాలు సాగించే గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావుకు వారు కృతజ్ఞతలు చెబుతున్నారు.

నేడు కొండగంగుబూడిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలో సోమవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించ నున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గు బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత వారం నిర్వహించాల్సిన 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం తుఫాన్ నేపథ్యంలో మండలంలో వాయిదా పడిందని పేర్కొన్నారు. తాజాగా కొత్త షెడ్యూల్ విడుదల చేశారు. సోమవారం కొండగంగుబూడిలో, 12న కుమ్మపల్లి, 13న పాటూరు 14న శింగరాయి గ్రామసచి వాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించను న్నట్లు స్పష్టం చేశారు. మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయ కులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శరవేగంగా ఆస్పత్రి భవనాల నిర్మాణం



శ్లాబ్ దశ పూర్తయిన పీహెచ్‌సీ భవనాలు

కొత్తవలస: మండల కేంద్రంలో సంతమార్కెట్ సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.1.65 కోట్లతో ఈ భవనాలు నిర్మిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం భవనాల నిర్మాణం శ్లాబ్ దశ పూర్తయింది. త్వరలో పనులను శతశాతం పూర్తి చేసి ప్రారంభించనున్నామని అధికారులు చెబుతున్నారు.

19న గ్రామీణ వైద్యుల ఆత్మీయ కలయిక

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని డీ మార్ట్ ఎదురుగా ఉన్న సర్వారాయ విహార్‌లో ఈనెల 19న గ్రామీణ వైద్యుల ఆత్మీయ కలయిక ఉంటుందని గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్షుడు గద్దె చిరంజీవి తెలిపారు. ఆదివారం స్థానిక పీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల గ్రామీణ వైద్యుల సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, సేవా కార్యక్రమాలు చేపట్టిన వారిని గుర్తించి పురస్కారాలు అందజేస్తామన్నారు. జోనల్ గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, జిల్లా కోశాధికారి కోట్ల పైడిరా జు, కోశాధికారి ఉమాశంకర్, సహాయ కార్యద ర్శి మక్కువ రమణ, ఉపాధ్యక్షుడు రామ్మూర్తి రాజు పాల్గొన్నారు.

వీనులవిందుగా గీతాలాపన

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఘంటసాల గీతాల ఆలాపన శ్రోతల కు వీనులవిందు చేసింది. యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటల దేవుడు ఘంటసాల స్వరపరిచిన, ఆలపించిన సినీగీతాలను పలువురు గాయనీగాయకులు ఆలపించారు. అంతకుముందు ఘంటసాల చిత్రపటానికి సంగీతాభిమానులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడం మన సంప్రదాయమని అన్నారు. అనంతరం ఘంటసాల పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆయన చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

● ఎస్‌ఐకు సన్మానం



ఎస్‌ఐ తారకేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు, పోలీస్ సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణ ఎస్‌ఐగా పనిచేసి విజయనగరానికి బదిలీ అయిన జె.తారకేశ్వరరావును పోలీస్ సిబ్బంది, నాయకులు స్థానిక సుబ్బరావిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం సన్మానించారు. ఎస్‌ఐ సేవలను నాయకులు కొనియాడారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, ఎస్.కోట ఉపసర్పంచ్ మోపాడ కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ, న్యాయవాదులు డబ్ల్యూ.ఎస్.శర్మ, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు ఆటో, మోటారు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



ఆలయంలో కొలువైన ఉమామహేశ్వరులు



అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న శివదీక్షాపరులు

విజయనగరం టౌన్: కార్తీకమాసాన్ని పురస్కరించుకున్ని స్థానిక అయ్యకోనేరు దక్షిణగట్టులో గల ఉమామహేశ్వర ఆలయంలో ఆదివారం మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు మురపాక శ్రీనివాసాచార్యులు, సందీప్‌శర్మలు పూజలు చేపట్టారు. పలురకాల ఫలరసాలతో శివలింగానికి అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో శివస్వాములు పాల్గొని సహాయ సహకారాలు అందించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

క్రీడలతో మానసికోల్లాసం...

- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర



క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న ఇరు జట్ల క్రీడాకారులతో మజ్జి సిరిసహస్ర

విజయనగరం రూరల్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్న ఉద్దేశంతో పట్టణ శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌కు కెప్టెన్లుగా సిరి సహస్ర, ప్రదీప్‌బాబు వ్యవహరించగా ప్రదీప్‌బాబు జట్టు విజేతగా లిలిచింది. అనంతరం సిరి సహస్ర మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలన్నా సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీను, సంతోష్, దక్షిణమూర్తి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగించుకోవాలి



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, వేదికపై ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

గుర్ల: ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని గరికివలస గ్రామంలో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబి రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. శిబిరంలో సుమారు 250 మంది మహిళలకు గైనిక్ సంబంధిత, ఇతర వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు , వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు, ఫౌండేషన్ సభ్యులు కలిగొట్ల బాబ్జి, భానోజీరావు పాల్గొన్నారు.

రూ.4.9 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం



పాపయ్యవలస గ్రామానికి వేసిన గ్రావెల్ రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని విజయరామపురం గ్రామానికి వెళ్లే తారు రోడ్డు నుంచి షికారుగంజి పంచాయతీ మధుర గ్రామం పాపయ్యవలసకు రూ.4.9 లక్షల జిల్లా పరిషత్ సాధారణ నిధుల తో గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఆ గ్రామానికి చెందిన సుమల రామకృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దన్నాన త్రినాథరావు, సర్పంచ్ సుంకరి వెంకటరావు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను గ్రామస్తులు రోడ్డు వేయాలని కోరారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయించారని, ఇటీవలే సుమారు 2.5 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు పనులు పూర్తయ్యాయని తెలిపారు. రోడ్డు వేయడంతో ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొలకెత్తిన ధాన్యం



బొడ్డాంలో మొలకలు వచ్చిన వరి కంకులను చూపిస్తున్న రైతు వెంకటరావు



చేను కుళ్లి పోయి మొలకలు వచ్చిన ధాన్యం

వేపాడ: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలు అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చాయి. పలుగ్రామాల్లో కోసిన వరి పంట నీట మునిగి పోవడంతో మొలకలు వచ్చాయి. బొడ్డాం రెవెన్యూలోని గంగులవాని చెరువు, పాటూరు రెవె న్యూలో రాయి చెరువులను ఆనుకుని ఉన్న పంటపొలాల్లో ఇంకా నీరు తగ్గలేదు. నీటిలోనే వరి కుప్పలు ఉండడం వల్ల చేను కుళ్లిపోయి ధాన్యానికి మొలకలు రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న దంపతులు

దత్తిరాజేరు: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని దత్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కందాడ హరికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం వేద పండితులు రమణాచార్యులు, విజయసారథి ఆలయ ధర్మకర్త పెంకి తిరుతి నాయుడు దంపతులతో పాటు మరో 50 మంది దంపతులతో స్వామి వారి వ్రతం చేయించారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

బొబ్బిలి: మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్ రైట్స్ ఫోరం చైర్మన్ పి.చిట్టిబాబు అన్నారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మానవ హక్కులపై అవగాహన కల్పించారు. స్వేచ్ఛ, సమానత్వం వంటి విషయాలు తెలియజేయడంతో పాటు వెట్టిచాకిరి, బానిసత్వం నుంచి రక్షణ పొందే హక్కు మానవ హక్కు కిందికే వస్తుందన్నారు. మానవ హక్కులతో ప్రతీ వ్యక్తి స్వేచ్ఛాయుత జీవనం సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బి.శంకరరావు, చంద్రరావు, రామాంజనేయ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీ పట్టాల పంపిణీ నేడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో రైతులకు డీ పట్టాలు, ఫ్రీ హోల్డ్ పట్టాలను సోమవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ధర్మరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సచివాలయం వద్ద 89 మందికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు పట్టాలు అందజేస్తారని పేర్కొన్నారు.